జాకీర్ హుస్సేన్ కన్నుమూత

అమెరికాలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన తబలా విద్వాంసుడు

- భారత శాస్త్రీయ సంగీతంలో తనదైన ముద్ర
- ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కైవసం

న్యూఢిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73)కన్నుమూశారు. హృద్రోగ సంబంధ సమస్యలతో రెండు వారాలుగా ఆయన అమెరికా శాన్‌ఫ్రాన్సిస్కోలోని దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో ఐసీయూలో చేర్చగా మరణించారని ఆయన స్నేహితుడు, ఫ్లూటిస్ట్ రాకేశ్ చౌరాసియా తెలిపారు. మరణించే సమయంలో హుస్సేన్ పెద్ద కుమారుడు, తబలా కళాకారుడు అల్లా రఖా తండ్రి వద్దే ఉన్నారు. హుస్సేన్ మృతికి పలువురు సంగీతకారులు, నటులు, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. 1951లో ముంబైలో జన్మించిన జాకీర్ తండ్రి ఉస్తాద్ అల్లా రఖా ఖాన్ కూడా ప్రముఖ తబలా సంగీతకారుడే. భారత శాస్త్రీయ సంగీతంలో జాకీర్ తనదైన ముద్ర వేశారు. తండ్రి వద్దనే సంగీతాన్ని అభ్యసించి ఏడేండ్ల వయసులోనే ఆయన కచేరీలలో తబలా వాయించేవారు. ముంబైలో గ్రాడ్యుయేషన్, జాకీర్ యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి సంగీతంలో డాక్టోరల్ డిగ్రీని పూర్తి చేశారు.

ఎన్నో అవార్డులు.. రివార్డులు

ఆరు దశాబ్దాల సంగీత ప్రస్థానంలో హుస్సేన్ ప్రతిష్ఠాత్మకమైన ఐదు గ్రామీ అవార్డులు గెల్చుకున్నారు. పలు భారత, అంతర్జాతీయ కళాకారులతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. జాకీర్ హుస్సేన్ 1991లో సంగీత నాటక అకాడమీ అవార్డు పొందారు. 2016లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వైట్‌హౌస్‌కు ఆహ్వానం పొందిన తొలి భారతీయ సంగీతకారుడు హుస్సేనే. ఆయన సేవలకు భారత ప్రభుత్వం1988లో పద్మశ్రీ, 2002లో పద్మ భూషణ్, 2023లో పద్మ విభూషణ్ అవార్డులతో సత్కరించింది. 1999లో అమెరికా ఆయనకు నేషనల్ హెరిటేజ్ ఫెలోషిప్ ప్రదానం చేసినప్పుడు భారత శాస్త్రీయ సంగీతానికి ప్రపంచ రాయబారిగా గుర్తింపు పొందారు. అతను 1973లో ఇంగ్లిష్ గిటారిస్ట్ జాన్ మెక్‌లాగ్లిన్, వయోలిన్ వాద్యకారుడు ఎల్ శంకర్, పెర్కెషన్ వాద్యకారుడు టీహెచ్ విక్కు వినాయక్‌రామ్‌తో కలిసి చేసిన సంగీత ప్రాజెక్టు సంగీత ప్రియులను కొత్త లోకంలోకి తీసుకువెళ్లింది. జాకీర్ హుస్సేన్ నటుడు కూడా. ఆయన శశికపూర్‌తో ఒక హాలీవుడ్‌తో పాటు పలు బాలీవుడ్ చిత్రాలలో నటించారు.

జమిలిపై కేంద్రం వెనకడుగు!

- **లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి బిల్లుల తొలగింపు**
- **నేడు సభలో ప్రవేశపెట్టే అవకాశం లేనట్టే**

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ఒకే దేశం-ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టాలన్న నిర్ణయంపై కేంద్రం యూటర్న్ తీసుకుందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈ బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడతామని కేంద్రం ఇదివరకే ప్రకటించింది. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు. లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాలు (సవరణ బిల్లు)ను సోమవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టనున్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే దానిని వాయిదా వేసి సోమవారం జాబితా చేసిన ఆర్థిక బిల్లులను సభ ఆమోదించిన తర్వాత ఈ వారంలోనే జమిలి ఎన్నికల బిల్లులు తీసుకురావచ్చునని ప్రభుత్వం తెలిపింది. కాగా, లోక్‌సభ బిజినెస్ జాబితాలో ఈ బిల్లుల అజెండా లేకపోయినప్పటికీ లోక్‌సభ అనుమతితో లెజిస్లేటివ్ అజెండా కింద సభలో ప్రవేశపెట్టే అధికారం ప్రభుత్వానికి ఉంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 20తో ముగియనున్నందున ఆ సమావేశాలు ముగిసే లోగా జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లులను సభలో ప్రవేశపెడతారని భావిస్తున్నారు.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారులు భారీ సంఖ్యలో ఏకకాలంలో నిర్వహించిన సంగీత ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ కోటలో ఆదివారం ఈ అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. 546 మంది సంగీత కళాకారులు అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారు.తాన్‌సేన్‌కు నివాళిగా నిర్వహిస్తున్న 100వ అంతర్జాతీయ తాన్‌సేన్ సమారోహ్‌లో భాగంగా ఈ ప్రదర్శన జరిగింది.

మాతో ఎస్కేఎం చేతులు కలపాలి

పంజాబ్ రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ విజ్ఞప్తి

చండీగఢ్, డిసెంబర్ 15: తాము చేస్తున్న పోరాటంతో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) చేతులు కలపాలని పంజాబ్ రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ సంఘానికి లేఖ రాసినట్టు ఆయన తెలిపారు. రైతుల డిమాండ్లను కేంద్రం ఆమోదించేలా ఒత్తిడి చేసేందుకు కర్షకులంతా కలిసికట్టుగా పోరాడాలని ఎస్కేఎం నేత రాకేశ్ టికాయత్ పిలుపునిచ్చిన కొద్ది రోజులకు పంధేర్ ఈ విధంగా స్పందించారు. ఎస్కేఎం(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాలు ప్రస్తుతం శంభు, ఖనౌరి సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ఢిల్లీ చలో పాదయాత్రను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. 'రైతులు, కూలీల సంక్షేమం దృష్ట్యా సంఘాల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను మరచిపోయి ఢిల్లీ ఆందోళన-2లో పాల్గొనాలని నేను నా సోదరులకు(ఎస్కేఎం)కు విజ్ఞప్తి చేస్తున్నా' అని పంధేర్ మీడియాతో తెలిపారు.

100 కంపెనీలు..4 లక్షల కోట్లు!

టాప్-100 డిఫాల్టర్లు ఎగ్గొట్టిన మొత్తం

మొండి బకాయిల్లో వాటిదే 43% వాటా

జాబితాలో బడా వ్యాపారుల కంపెనీలు

ఆర్టీఐ ద్వారా వెలుగులోకి

న్యూఢిల్లీ : మన దేశంలోని బడా పారిశ్రామికవేత్తలు, కంపెనీలు సునాయాసంగా బ్యాంకు రుణాలను ఎగ్గొడుతున్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సేకరించిన సమాచారం ప్రకారం, 2019 మార్చి నాటికి నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ)లో 43 శాతానికిపైగా (రూ.4.02 లక్షల కోట్లు) టాప్-100 డిఫాల్టర్లకు చెందినవే. స్థూల ఎన్‌పీఏలలో 30 శాతానికిపైగా (రూ.2.86 లక్షల కోట్లు) వీటిలో 30 కంపెనీలు ఎగ్గొట్టినవే. 2019 మార్చి 31నాటికి మన దేశంలోని షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంకులకు ఎగ్గొట్టిన అడ్వాన్స్‌లు, రుణాల మొత్తం (స్థూల ఎన్‌పీఏలు) రూ.9.33 లక్షల కోట్లు. భారత దేశ బ్యాంకింగ్ వ్యవస్థ చరిత్రలో 2018 తర్వాత నమోదైన రెండో అతి పెద్ద మొండి బకాయిల మొత్తం ఇది.

15 కంపెనీల ఎన్‌పీఏలే 4.58 లక్షల కోట్లు

ఈ టాప్-100 బ్యాంక్ డిఫాల్టర్స్‌లో బడా పారిశ్రామికవేత్తలు నడుపుతున్న వివిధ రంగాలకు చెందిన పెద్ద కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు 2019 మార్చి 31నాటికి రూ.8.44 లక్షల కోట్లు రుణాలు ఎగ్గొట్టాయి. దీనిలో సగానికిపైగా రాని బాకీలుగా బ్యాంకులు ప్రకటించాయి. ఈ 100 కంపెనీల మొత్తం రుణాల్లో సగానికిపైగా అంటే, రూ.4.58 లక్షల కోట్లు 15 కంపెనీలు తీసుకున్నాయి. ఇవి మాన్యుఫ్యాక్చరింగ్, విద్యుత్తు, నిర్మాణ రంగాలకు చెందిన కంపెనీలు.

ఆ రంగాలవే అధికం..

స్థూల ఎన్‌పీఏలు 2015 మార్చి 31నాటికి రూ.3.23 లక్షల కోట్లు కాగా, 2018 మార్చి 31నాటికి రికార్డు స్థాయిలో రూ.10.36 లక్షల కోట్లకు పెరిగాయి. 2019లో తగ్గడం ప్రారంభమై, 2023 మార్చి 31నాటికి రూ.5.71 లక్షల కోట్లకు తగ్గాయి. దీనికి కారణం కొంత వరకు రుణదాతలు రైట్‌డౌన్ చేయడం. బ్యాంక్ రుణాలు, అడ్వాన్స్‌ల ఎగవేతకు పాల్పడుతున్నవాటిలో వివిధ రంగాలకు చెందిన కంపెనీలు ఉంటున్నాయి. మాన్యుఫ్యాక్చరింగ్, ఇంధనం, విద్యుత్తు, నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్, టెలికాం వంటి రంగాలకు చెందిన కంపెనీల ఎన్‌పీఏలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ జాబితాలోని 82 కంపెనీలు దివాలా ప్రక్రియలో వివిధ దశల్లో ఉన్నాయి. మూడో వంతు కంపెనీలు లిక్విడేషన్ రూట్‌లో వెళ్తున్నాయి. అంటే వీటి నుంచి బ్యాంకులకు చాలా తక్కువ సొమ్ము మాత్రమే లభిస్తుంది.

కంపెనీ	రుణం (రూ.కోట్లు)
భూషణ్ పవర్ అండ్ స్టీల్	41,400
ఎస్సార్ స్టీల్ ఇండియా	69,360
వీడియోకాన్ ఇండస్ట్రీస్	58,052
వీవోవీఎల్	1,189
జయప్రకాశ్ అసోసియేట్స్	36,591
కేఎస్‌కే మహానది పవర్ కంపెనీ	921
రిలయన్స్ కమ్యూనికేషన్స్	46,659
ఆలోక్ ఇండస్ట్రీస్	29,569
ప్రయాగ్‌రాజ్ పవర్ జనరేషన్	13,767
జయప్రకాశ్ పవర్ వెంచర్స్	23,193

ఈ కంపెనీల్లో అధిక రుణం తీసుకున్న కంపెనీల నిరర్థక ఆస్తులు తక్కువగా ఉండి ఉండవచ్చు. టాప్-100 బ్యాంక్ డిఫాల్టర్ల జాబితాను వాటి ఔట్‌స్టాండింగ్ ఎన్‌పీఏల ఆధారంగా రూపొందించారు.

రంగాల వారీగా డిఫాల్టర్ కంపెనీలు

ఎనర్జీ	34
మాన్యుఫ్యాక్చరింగ్	32
నిర్మాణం	20
టెలికం	5
ఇతర	9

అమెరికాలో రోడ్డు ప్రమాదం

తెలుగు విద్యార్థిని మృతి

మరో ఇద్దరికి గాయాలు

వాషింగ్టన్, డిసెంబర్ 15: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారత్‌కు చెందిన తెలుగు విద్యార్థిని మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. టెనస్సీ రాష్ట్రంలోని మెంఫిస్ నగరంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారి వాహనం, మరో వాహనం ఢీకొనడంతో భారత్‌కు చెందిన 26 ఏండ్ల నాగ శ్రీ వందన పరిమళ గాయపడింది. ఆమెను దవాఖానలో చేర్చగా అక్కడ మృతి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆమె యూనివర్సిటీ ఆఫ్ మెంఫిస్‌లో ఎంఎస్ చేస్తున్నది. గాయపడిన పవన్, నిఖిత్‌ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. రెండు వాహనాల్లో ఒకటి వేగాన్ని నియంత్రించుకోలేక మరో వాహనాన్ని ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలిపారు.

గెలిస్తే సంబరాలు... ఓడితే విమర్శలా?

ఈవీఎంలపై కాంగ్రెస్ తీరును తప్పుబట్టిన ఒమర్

న్యూఢిల్లీ: ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ తరచూ విమర్శలు చేయడాన్ని ఇండియా కూటమి నేత, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. ఓటింగ్ పద్ధతిని ప్రశ్నించడంలో స్థిరంగా ఒక విధానానికి కట్టుబడి ఉండాలని, గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని, ఓడినప్పుడు విమర్శలు చేయడం సరికాదని అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'పార్లమెంట్ ఎన్నికల్లో అవే ఈవీఎంల ద్వారా 100 సీట్లను తెచ్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన వెంటనే ఈవీఎంలు నచ్చలేదు. వాటిని తప్పుబడుతున్నారు. ఇదేం విధానం. ఎంతమాత్రం సరికాదు' అని కాంగ్రెస్ తీరును విమర్శించారు.

న్యూఢిల్లీ నుంచి కేజ్రీవాల్ పోటీ

ఆప్ తుది జాబితా విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 38 మంది అభ్యర్థులతో ఆదివారం తుది జాబితాను విడుదల చేసింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తుండగా ముఖ్యమంత్రి అతిశీ గతంలో పోటీ చేసిన కల్కాజీ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ ఎక్స్ ద్వారా బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఆ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ లేరని ఆయన ఎద్దేవా చేశారు. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, పూర్తి సన్నద్ధతతో ఎన్నికల్లో పోటీ చేస్తోందని కేజ్రీవాల్ తెలిపారు. బీజేపీకి అవే కొరవడ్డాయని ఆయన విమర్శించారు.

అధికారుల అదృశ్యం వెనుక

హసీనా హస్తం!

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం అధికారంలో ఉండగా బంగ్లాదేశ్‌లో వేలాది మంది మిలటరీ, పోలీస్ అధికారులను బలవంతంగా అదృశ్యం చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో విచారణ సంఘం ఏర్పాటు చేసింది. అధికారుల అదృశ్యం వెనుక షేక్ హసీనా హస్తముందని కమిటీ పేర్కొన్నది. 'సత్యాల ఆవిష్కరణ' పేరున ఈ కమిటీ తన నివేదికను చీఫ్ అడ్వయిజర్ మహ్మద్ యూనస్‌కు శనివారం అందజేసింది. హసీనా హయాంలో 3,500 మందికి పైగా ఉన్నత అధికారులు అదృశ్యమయ్యారని, అధికారుల అదృశ్యానికి హసీనా ఇచ్చిన ఆదేశాలు, ఆమె ప్రమేయంపై ఆధారాలు లభ్యమయ్యాయని చీఫ్ అడ్వయిజర్ ప్రెస్ వింగ్ కార్యాలయం తెలిపింది.

పని ఒత్తిడితో వేళ్లు నరికేసుకున్న ఉద్యోగి

సూరత్‌లో షాకింగ్ ఘటన

ముంబై: ఉద్యోగంలో ఒత్తిడితో ఓ ఉద్యోగి తన ఎడమ చేతి వేళ్లను తానే నరికేసుకున్నాడు. వారం రోజుల క్రితం సూరత్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చేతివేళ్లు నరికేసుకున్న 32 ఏండ్ల వ్యక్తి.. నగరంలోని ఓ నగల దుకాణంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి ఎడమ చేతి నాలుగువేళ్లు తెగిపోయాక అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ జరపగా.. తనపై దాడి జరిగిందని తొలుత పోలీసులను నమ్మించాడు. దీంతో కేసు విచారణ ఓ పజిల్‌గా మారింది. క్రైమ్ బ్రాంచ్ రంగంలోకి దిగా విచారణ జరపటంతో అసలు విషయం బయటకు వచ్చింది. స్థానికంగా ఉండే ఓ దుకాణంలో పదునైన స్టీల్ కత్తిని కొనుగోలు చేసిన సంగతి తెలుసుకున్న పోలీసులు అతడి చెబుతున్న విషయంపై అనుమానం వ్యక్తం చేశారు. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేయాలన్న కసితో, తనకు తానే హాని తలపెట్టుకున్నానని చివరికి అతడు ఒప్పుకున్నాడు. నగల దుకాణం యజమాని తన తండ్రికి దగ్గరి స్నేహితుడు అయినందున, ఉద్యోగంలో కొనసాగాలన్న ఒత్తిడి తనపై ఉందని, దీంతో పరిస్థితుల నుంచి తప్పించుకోలేక.. చేతి వేళ్లు కోసుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్టు అతడు వివరించాడు.

ఫ్రాన్స్‌లో తుఫాన్ బీభత్సం

వందలాది మంది చనిపోయినట్టు వార్తలు

మాయోట్: ఫ్రాన్స్‌లోని హిందూ మహాసముద్రంలో ఉన్న మాయోట్ ద్వీప సమూహంపై విరుచుకుపడిన చైడో తుఫాన్ వందలాది మందిని బలిగొన్నట్లు ఫ్రెంచ్ అధికారులు ఆదివారం ప్రకటించారు. తుఫాన్ బీభత్సానికి అనేక పట్టణాలు ధ్వంసమయ్యాయని, దాదాపు వెయ్యి మంది వరకు మరణించి ఉండవచ్చని వారు చెప్పారు. విద్యుత్తు సరఫరా, మంచి నీటి సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నట్లు వారు చెప్పారు. మృతుల సంఖ్యపై పూర్తి స్పష్టత రావాలంటే చాలా రోజులు పడుతుందని, ప్రాథమిక అంచనాల ప్రకారం14 మంది మరణించారని స్థానిక భద్రతా వర్గాలు తెలిపాయి.

దేశంలో తొలి డయాబెటిస్ బయోబ్యాంక్

చెన్నైలో స్థాపించిన ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: సైంటిఫిక్ పరిశోధనలను బలపరిచే లక్ష్యంతో ప్రజలకు సంబంధించిన జీవసంబంధ నమూనాలను భద్రపరిచే దేశంలోనే మొట్టమొదటి డయాబెటిస్ బయో బ్యాంకును భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) చెన్నైలో స్థాపించింది. మద్రాసు డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్(ఎండీఆర్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ బయోబ్యాంకు ఏర్పడింది. బయోస్పెసిమెన్ల సేకరణ, ప్రాసెస్ చేయడం, భద్రపరచడం, పంపిణీ చేయడం ఈ బయోబ్యాంకు లక్ష్యాలు. ఐసీఎంఆర్ అనుమతితో శాస్త్రీయ పరిశోధనలకు ఈ బయోబ్యాంకు తోడ్పాటును అందిస్తుంది. డయాబెటిస్ వచ్చేందుకు కారణాలు, డయాబెటిస్‌లో భారతీయ రకాలకు చెందిన తేడాలు, సంబంధిత రుగ్మతలను బయోబ్యాంకు సాయంతో ఆధునిక పరిశోధనలు జరుగుతాయని ఎండీఆర్ఎఫ్ చైర్మన్, డాక్టర్ వీ మోహన్ తెలిపారు.

కస్టడీలో తల్లితో నిఖిత

న్యాయం జరిగేదాకా చితా భస్మం కలపం

బెంగళూరు టెకీ సుభాశ్ తండ్రి స్పందన

సమస్తిపూర్: దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన బెంగళూరు టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య కేసులో ఆయన భార్య నిఖిత, అత్త, బావ మరిదిని కర్ణాటక పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. దీనిపై సుభాశ్ తండ్రి పవన్ కుమార్ ఆదివారం స్పందించారు. తమకు న్యాయం జరిగే వరకు తమ కుమారుడి చితా భస్మాన్ని నీళ్లలో కలపమని ప్రకటించారు. 'నా కొడుకును వేధించిన వాళ్లంతా శిక్ష అనుభవించాలి. అప్పుడే నా కొడుక్కి న్యాయం జరిగి, అతడి ఆత్మ శాంతిస్తుంది. అంత వరకు అతడి చితా భస్మాన్ని గంగలో కలపను' అని ఆయన మీడియాకు తెలిపారు. ఈ కేసులో ప్రధాని మోదీ, సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'నా కొడుకు హృదయం ముక్కలైంది. భార్య, అత్త ఎంతగానో వేధించినా.. ఆ విషయాన్ని అతడెవరికీ చెప్పలేదు. తన కొడుకుని మా కస్టడీకి అప్పగించాలని సుభాశ్ సూసైడ్ నోట్‌లో కోరాడు' అని ఆయన తెలిపారు.

నా ఉత్థాన పతనాలకు గాంధీలే కారణం

- **వారిని నేరుగా కలుసుకుని చాలా ఏళ్లు అయింది**
- **కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: కాంగ్రెస్ పార్టీలో తన ఉత్థాన పతనాలలో గాంధీ కుటుంబం పాత్ర ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ వెల్లడించారు. తన రాజకీయ జీవితాన్ని తయారు చేసిందీ, దెబ్బతీసిందీ గాంధీ కుటుంబమే కావడం తన జీవితంలో విషాదమని ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబానికి చెందిన ముఖ్యులతో నేరుగా మాట్లాడి చాలా ఏళ్లు గడిచాయని ఆయన పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. సోనియా గాంధీని నేరుగా కలుసుకోవడానికి 10 సంవత్సరాలలో ఒక్కసారి కూడా తనకు అవకాశం ఇవ్వలేదని, ఒకే ఒక్కసారి రాహుల్ గాంధీతో కొద్దిసేపు మాట్లాడే అవకాశం లభించిందని ఆయన చెప్పారు. ప్రియాంక గాంధీని ఒకటి రెండు సందర్భాలలో కలుసుకున్నట్లు ఆయన తెలిపారు. అప్పుడప్పుడు ప్రియాంక గాంధీ తనను ఫోన్‌లో పలకరిస్తారని, ఈ ఒక్కటే ఆ కుటుంబంతో తనకు ఉన్న సంబంధమని ఆయన పేర్కొన్నారు. ప్రియాంక ద్వారా రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు అందచేస్తున్నట్లు ఆయన చెప్పారు. రాహుల్‌తో నేరుగా మీరే మాట్లాడవచ్చు కదా అని ఒకసారి ప్రియాంక తనతో అన్నారని, అయితే పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన తర్వాత పార్టీ నాయకులతో నేరుగా ఎలా మాట్లాడగలనని తాను ఆమెతో అన్నట్లు అయ్యర్ చెప్పారు. ఇలా ఉండగా యూపీఏ 2 ప్రభుత్వ పగ్గాలను ప్రణబ్ ముఖర్జీకి, రాష్ట్రపతి పదవికి మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేసి ఉంటే దేశ రాజకీయాలు వేరేగా ఉండేవని మణిశంకర్ అయ్యర్ తన తాజా పుస్తకం "మావెరిక్ ఇన్ పాలిటిక్స్"లో వెల్లడించారు. ఈ పుస్తకం త్వరలో విడుదల కానుంది.

39మందితో 'మహాయుతి' క్యాబినెట్

బీజేపీకి-19, శివసేనకి-11, ఎన్సీపీకి-9 బెర్తులు

ముంబై, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన 10 రోజుల తర్వాత ఫడ్నవీస్ సర్కార్ మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ 39 మంది ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించారు. సోమవారం నుంచి శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నాగ్‌పూర్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, దీనికి ఒకరోజు ముందు మహాయుతి కూటమి మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. మంత్రివర్గంలో బీజేపీ నుంచి 19 మంది, శివసేన-11, ఎన్సీపీ నుంచి 9 మంది ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులేతో పాటు 33 మంది క్యాబినెట్ మంత్రులుగా, మరో ఆరుగురు సహాయ మంత్రులుగా ప్రమాణం చేశారు. మహారాష్ట్ర క్యాబినెట్‌లో గరిష్ట సభ్యుల సంఖ్య 43. తాజా మంత్రివర్గ విస్తరణతో సభ్యుల సంఖ్య 42కు చేరుకుంది. వీరిలో దివంగత బీజేపీ నేత గోపీనాథ్ ముండే కుమార్తె పంకజ, ఆమె సోదరుడు ధనంజయ్ ముండే, ఎన్సీపీ నుంచి ఏకైక ముస్లిం ఎమ్మెల్యే హసన్ ముష్రిఫ్ ఉన్నారు.

టెక్స్ట్‌ప్రాంప్ట్‌ను వీడియోగా మార్చే 'సోరా'

- **సరికొత్త ఏఐ టూల్‌ను ఆవిష్కరించిన ఓపెన్‌ఏఐ**
- **చాట్‌జీపీటీ ప్లస్ చందాదారులకు అందుబాటులోకి**

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: చాట్‌జీపీటీని సృష్టించిన ఓపెన్‌ఏఐ సరికొత్త ఏఐ టూల్‌ను ఆవిష్కరించింది. టెక్స్ట్ ప్రాంప్ట్ల(కృత్రిమ మేధ లాంగ్వేజీ మోడల్స్‌కు ఇచ్చే నిర్దిష్టమైన కీ వర్డ్స్ లేదా వాక్యాలు) నుంచి వీడియోలను తయారుచేసే 'సోరా'ను ఆవిష్కరించింది. ఈ టూల్ అమెరికా, ఇతర దేశాల మార్కెట్లలోని చెల్లింపు వినియోగదారులకు అందుబాటులో ఉందని తెలిపింది. ఈ కొత్త రకం టూల్ 20 సెకన్ల నిడివి గల వీడియో క్లిప్స్‌ను బహుళ సంఖ్యలో వైవిధ్యంగా రూపొందించగలదు. ఈ టూల్‌తో చౌకగా వీడియో క్లిప్‌లను తయారు చేయవచ్చు. ఆరంభంలో సోరా లభ్యత పరిమితంగా ఉంటుందని ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. స్టిల్ చిత్రాలు, వీడియోలు, టెక్స్ట్ ప్రాంప్ట్స్‌ల నుంచి సోరా వీడియోలను ఉత్పత్తి చేస్తుందని ఓపెన్ ఏఐ పేర్కొంది. యూజర్ ఏదైనా వీడియో క్లిప్ అప్‌లోడ్ చేస్తే సోరా దాని ఫుటేజీని విభజించి నిడివిని పెంచుతుంది. ఈ టూల్‌లో స్టోరీ బోర్డ్ ఆప్షన్‌తో పాటు ఇతరులు సృష్టించిన వీడియోలను అన్వేషించే సదుపాయం ఉంది. ఈ టూల్ వల్ల హాలీవుడ్‌లో చాలా మంది ఉపాధికి గండి పడే ప్రమాదం ఉందని భయాలు వ్యక్తం అవుతున్నాయి.

వెయ్యేండ్ల విద్యుత్తుకు సరిపడా హైడ్రోజన్ నిల్వలు!

- ***భూ అంతర్భాగంలో ట్రిలియన్ల కొద్దీ నిక్షేపాలు***
- ***అమెరికా జియోలాజికల్ సర్వేలో వెల్లడి***

న్యూఢిల్లీ: భూమిలోపల భారీ ఎత్తున హైడ్రోజన్ నిల్వలు ఉన్నట్టు అమెరికాలోని జియోలాజికల్ సర్వే అధ్యయనంలో తేలింది. ఈ నిల్వలతో ప్రపంచానికి వెయ్యి సంవత్సరాలకు పైగా విద్యుత్తును అందించవచ్చునని అమెరికా భూగర్భ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భూమి కింది పొరల్లో దాదాపు 6.2 ట్రిలియన్ టన్నుల హైడ్రోజన్ నిక్షేపాలు ఉన్నట్టు ఈ అధ్యయనం పేర్కొన్నది. ఈ నిల్వల్లో చాలా కొద్ది పరిమాణంలో వెలికి తీసినా దాదాపు 200 సంవత్సరాల పాటు శిలాజ ఇంధనాలపై ఆధారపడకుండా విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. భూమిపై సహజ రసాయన ప్రక్రియ సమయంలో ఏర్పడిన భౌగోళిక (జియోలాజికల్) హైడ్రోజన్ బహుళ అవసరాలను తీర్చగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటివరకు అల్బేనియా, మాలి సహా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే దీనిని గుర్తించారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ నిల్వలు ఉన్నాయని తాజా అధ్యయనం పేర్కొన్నది. ఇందులో చాలావరకు భూమి లోపలి ఉండొచ్చని భావిస్తున్నారు. దీనిపై యూనివర్సిటీ కాలేజ్ లండన్ ప్రొఫెసర్ మెక్ గైర్ మాట్లాడుతూ, 'వాతావరణ అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనడానికి, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి అవసరమైన స్థాయిలో భూమి లోపలి హైడ్రోజన్ నిల్వల్ని వెలికి తీయాలి. ఇందు కోసం అపారమైన ప్రపంచ చొరవ అవసరం' అని అన్నారు. ప్రస్తుతం భూమిలో నుంచి వెలికి తీస్తున్న సహజ వాయువు ఇంధనం కన్నా 'హైడ్రోజన్' ఇంధనం ఎన్నో రెట్లు శక్తివంతమైనది. పెట్రోల్, డీజిల్ నుంచి పెద్ద మొత్తంలో కార్బన్ డయాక్సైడ్, ఇతర హానికర వాయువులు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. దీనికి 'హైడ్రోజన్' చక్కటి ప్రత్యామ్నాయ ఇంధనం అవుతుందని సైంటిస్టుల నమ్మకం.

క్షణాల్లో సైబోర్గ్‌లుగా బొద్దింకలు

అద్భుత యంత్రాన్ని రూపొందించిన పరిశోధకులు



సింగపూర్, డిసెంబర్ 15: సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ పరిశోధకులు అద్భుతాన్ని సృష్టించారు. క్షణాల్లోనే బొద్దింకలను సైబోర్గ్‌లుగా(యంత్ర పరికరాల సాయంతో శారీరక సామర్థ్యం పెంచుకున్న జీవులు) మార్చగలిగే ప్రత్యేక యంత్రాన్ని రూపొందించారు. పోర్టబుల్ స్టిమ్యులేషన్, కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్ పరికరాలతో కూడిన ఈ యంత్రాన్ని కేవలం 68 సెకన్ల వ్యవధిలోనే బొద్దింకకు అమర్చి సైబోర్గ్‌గా మార్చవచ్చని వెల్లడించారు. చిన్న ఎలక్ట్రానిక్ బ్యాక్‌ప్యాక్ కిట్ లాంటి ఈ యంత్రాన్ని అమర్చడం ద్వారా బొద్దింకల ప్రవర్తనను, గమన దిశను ప్రభావితం చేయవచ్చని, యాంటెన్నాలను స్టిమ్యులేట్ చేయడం ద్వారా వాటిని ఎటు కావాలంటే అటు వెళ్లేలా చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో బొద్దింకలకు ఎలాంటి హాని జరగదని తెలిపారు. ఈ ప్రక్రియతో సైబోర్గ్ బొద్దింకల సైన్యాలను సృష్టించవచ్చని, రిమోట్ కంట్రోల్ సాయంతో నియంత్రించగలిగే ఈ సైబోర్గ్ బొద్దింకలను సెర్చ్, రెస్క్యూ లాంటి ప్రత్యేక కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవచ్చని వివరించారు.